సాక్షి
చిత్తూరు
శుక్రవారం । 6 । డిసెంబర్ । 2024

న్యూస్‌రీల్

ముగిసిన శిక్షణ తరగతులు



కుప్పం హార్టికల్చర్ హబ్‌లో మొక్కలను పరిశీలిస్తున్న అధికారులు

కుప్పం: స్థానిక హార్టికల్చర్ హబ్‌లో రెండు రోజులు పాటు 12 రాష్ట్రాలు, 35 మంది ఉద్యాన శాఖ అధికారులకు నిర్వహించిన శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. కుప్పం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ శిక్షణపై అధికారులు హర్షం వ్యక్తం చేశారు. హైబ్రీడ్ బంతిపూల విత్తన తయారీ, అంటుకట్టిన వంగ మొక్కల తోటలను సందర్శించి పంటల సాగుల్లో మెళకువలు గుర్తించారు. అంటుకట్టడం ద్వారా వచ్చే వంగడాలను పొలంలో నాటడం ద్వారా మెరుగైనా ఫలితాలు సాధించవచ్చని అధికారులు పేర్కొన్నారు. అంటుకట్టిన మొక్కలు ద్వారా తెగుళ్ల నివారణతో దిగుబడి అధికంగా ఉంటుందని అధికారులు ఈ శిక్షణ తరగతుల్లో వివరించారు. ఇండో ఇజ్రాయిల్ భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్ ఆధునిక సాంకేతికను రైతులకు అందిస్తున్నట్లు ఇజ్రాయిల్ ఎంబైసీ న్యూఢిల్లీ అగ్రికల్చర్ అటాచి ఉరీ రూబిన్ స్టీన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్ రెడ్డి, ఏడీ కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించాలి



తవణంపల్లె ఎంపీడీఓ రెడ్డిబాబుకు సూచనలిస్తున్న జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు

తవణంపల్లె: సచివాలయ సిబ్బంది తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి, ప్రజలకు సేవలందించాలని జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు తెలిపారు. గురువారం మండలంలోని దిగువమాఘం సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలో రికార్డులు, సిబ్బంది హాజరుపట్టిని పరిశీలించారు. వివిధ సర్వే యాప్‌లను వెంటనే పూర్తి చేసి, అప్‌లోడ్ చేయాలని సూచించారు. పథకాల అమలు ఎలా చేస్తున్నారని ఆరా తీశారు. ఉద్యోగ రీత్యా తమ విధులను నిర్వర్తించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం తవణంపల్లె ఎంపీడీఓ కార్యాలయాలన్ని పరిశీలించారు. నిధులు పక్క దారి పట్టించకుండా జాగ్రత్తగా వినియోగించాలని ఎంపీడీఓ రెడ్డిబాబును ఆదేశించారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ఆరా తీశారు. రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. డీఎల్‌డీఓ రవికుమార్, ఎంపీడీఓ రెడ్డిబాబు పాల్గొన్నారు.

● జైత్రయాత్ర



పొగలు చిమ్ముతూ నింగిలోకి దూసుకెళ్తున్న పీఎస్‌ఎల్‌వీ సీ-59 రాకెట్

పీఎస్‌ఎల్‌వీ రాకెట్ బహుళ ప్రయోజనకారిగా మారి ఇస్రో చరిత్రను తిరగరాస్తోంది. ప్రపంచ పటం మీద ఇస్రో తిరుగులేని వజ్రాయుధంగా మారుతోంది. పోలార్ లాంచింగ్ శాటిలైట్ వెహికల్ (పీఎస్‌ఎల్‌వీ) వాణిజ్యపరమైన ప్రయోగాల్లో బ్రహ్మాస్త్రంలా మారింది. శ్రీహరికోట రాకెట్ కేంద్రం నుంచి గురువారం సాయంత్రం 4.04 గంటలకు ప్రయోగించిన పీఎస్‌ఎల్‌వీ సీ59 ప్రయోగంతో ఇప్పటిదాకా 61 ప్రయోగాలు చేయగా రెండు ప్రయోగాలు మాత్రమే విఫలమయ్యాయి. అతి పెద్ద ఉపగ్రహాలను ఇస్రో ఫ్రాన్స్, రష్యా అంతరిక్ష సంస్థల నుంచి పంపిస్తుంటే అతిచిన్న విదేశీ ఉపగ్రహాలను పీఎస్‌ఎల్‌వీ ద్వారా ప్రయోగించి వాణిజ్యపరంగా ఆదాయాన్ని తీసుకొచ్చే అతిపెద్ద ఆదాయ గనిగా మారింది. చంద్రయాన్, మంగళ్‌యాన్, సూర్యయాన్ లాంటి గ్రహాంతర ప్రయోగాలు, ఒకే సారి పది ఉపగ్రహాలు, మళ్లీ 20 ఉపగ్రహాలు, ఆ తరువాత 104, మళ్లీ 38 ఉపగ్రహాలను మోసుకెళ్లి అంతరిక్ష కక్ష్యలో ప్రవేశపెట్టగలిగిన సత్తా పీఎస్‌ఎల్‌వీకే మాత్రమే దక్కింది. ఇప్పటిదాకా 61 పీఎస్‌ఎల్‌వీ రాకెట్‌ల ద్వారా 503 ఉపగ్రహాలను ప్రయోగించగా ఇందులో 433 విదేశీ ఉపగ్రహాలే కావడం విశేషం. 70 స్వదేశీ ఉపగ్రహాలతో పాటు దేశంలోని పలు యూనివర్సిటీలకు చెందిన 13 చిన్నపాటి ఉపగ్రహాలను ప్రయోగించారు.

– నూళ్లూరుపేట

కరి.. మృత్యు కౌగిలి

అంతరిస్తున్న అడవులు.. అడుగంటుతున్న జలవనరులు.. కొరవడుతున్న ఆహార మార్గాలు.. గజరాజులు జనారణ్యంలోకి పరుగులు..పొలాల్లో తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు..రక్షణ కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్లు.. కొరవడిన వన్యప్రాణి సంరక్షణ చర్యలు..వెరసి..ఆహార అన్వేషణలో ఉన్న ఏనుగులకు మృత్యుపాశాలుగా మారుతున్నాయి. ఫలితంగా పలు ఏనుగులు మృత్యువాత పడుతున్నాయి.



ట్రాన్స్‌ఫార్మర్ తగిలి మృతి చెందిన గజరాజు(ఫైల్)

- విద్యుత్ ప్రమాదాలు, అనారోగ్యంతో మృత్యువాత
- మండలంలో ఆరు ఏనుగులు మృతి
- మరో వైపు ఆహారం కోసం అన్వేషణ

బంగారుపాళెం: ఆహార అన్వేషణలో తమిళనాడు–ఆంధ్రా సరిహద్దు ప్రాంతాన్ని దాటుకుంటూ జిల్లాలోకి ప్రవేశించిన ఏనుగుల మృత్యువాత పడుతున్నాయి. పంటపొలాల్లో సంచరిస్తూ విద్యుత్ ప్ర మాదాలకు గురై మృతి చెందుతున్నాయి. మండలంలో గత ఐదేళ్లలో ఆరు ఏనుగులు కరంటు షాక్‌కు గురై మృత్యువాతపడ్డాయి. కుప్పం, పలమనేరు, బంగారుపాళెం అటవీ ప్రాంతాలు ఎలిఫెంట్ కారిడార్ గా ఉండడంతో తరచూ ఏనుగులు మండలంలోని అటవీ శివారు గ్రామాల్లో పంటలపై దాడులు చేస్తున్నాయి.

తమిళనాడు నుంచి జిల్లాలోకి..

ఏనుగులు ఏటా తమిళనాడు నుంచి జిల్లాలోకి వస్తుంటాయి. వాటి రాకను గుర్తించి అటవీశాఖ మళ్లించే చర్యలు చేపడుతున్నా ఫలితం లేకపోతోంది. గత 20 ఏళ్లుగా ఈ తంతు కొనసాగుతూనే ఉంది. కౌండిన్య అభయారణ్యం 350 చదరపు కిలోమీటర్ల విస్తరించి ఉంది. అటవీ ప్రాంతంలో చిరుతలు, ఏనుగులు సంచరిస్తున్నాయి. జిల్లాలో 90కి పైగా ఏనుగులు ఉన్నాయని, కౌండిన్య అటవీ ప్రాంతంలో 30 నుంచి 35 ఏనుగులు ఉండగా అవి గుంపులు, గుంపులుగా విడిపోయి సంచరిస్తున్నాయని సాధారణంగా సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు ఎక్కువగా జిల్లా సరిహద్దుల్లో సంచరిస్తూ తిరిగి తమిళనాడుకు వెళ్లిపోతాయని అటవీశాఖ అధికారులు అంటున్నారు.

గజరాజులకు రక్షణ కరువు

మండలంలోని కొదలమడుగు, బండ్లదొడ్డి, సామచేనుమిట్ట, టేకుమంద, కీరమంద, వేపనపల్లె, మొగిలి, మొగిలివారిపల్లె గ్రామాలు కౌండిన్య అటవీ సరిహద్దుకు సమీపంలో ఉన్నాయి. ఇక్కడ సోలార్ కంచె గానీ, కందకాలు ఏర్పాటు చేయలేదు. దీంతో తరచూ ఏనుగులు పంటపొలాలపై దాడులు చేస్తున్నాయి. గ్రామంలోని పొలాల వద్ద తక్కువ ఎత్తులోనే కరెంటు తీగలు వేలాడుతుండడంతో రాత్రి సమయంలో ఏనుగులు సంచరించే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై ఏనుగులు చనిపోతున్నాయి. అంతే కాకుండా పొలాల సమీపంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఎటువంటి రక్షణ చర్యలు తీసుకోకపోవడం ఏనుగులు పాలిట మృత్యుపాశంగా మారాయి.

ప్రమాదాల నివారణపై కలెక్టర్ సమీక్ష

విద్యుత్ తీగలు తగిలి ఏనుగులు మృత్యువాత పడకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ ఫారెస్టు, విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. గత నెలలో అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కుప్పం, వికోట, పలమనేరు, బంగారుపాళెం, పులిచర్ల తదితర మండలాల్లో 491 ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయన్నారు. వీటి బారిన పడి ఏనుగులు మృతి చెందుతున్నాయన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లను నిర్మానుష్య ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలని సూచించారు.

ఆహారం కోసం వచ్చి మృత్యువాత



గాండ్లపల్లె వద్ద ప్రమాదవశాత్తు బావిలో పడిన ఏనుగు(ఫైల్)

- 2018లో మండలంలోని శేట్టేరి సమీపంలో ఓ రైతు మామిడి తోటలో మొదటి సారిగా ఓ ఏనుగు మృతి చెందింది. ఏనుగు అనారోగ్య కారణంతో మృతి చెందినట్లు తిరుపతి జూ పార్కు వైద్యాధికారులు ధ్రువీకరించారు.
- 2019లో మొగిలివారిపల్లె సమీపంలో రైతు పొలం వద్ద తక్కువ ఎత్తుతో ఉన్న కరెంటు తీగలు తగలడంతో ఏనుగు మృతి చెందింది.
- 2020లో టేకుమంద గ్రామంలో మామిడి తోటలో కరెంటు స్తంభాన్ని ఢీకొనడంతో కరెంటు తీగలు ఏనుగుపై పడడంతో మృత్యువాత పడింది.
- 2021లో వేపనపల్లె వద్ద విద్యుత్ మోటారుకు అమర్చిన వైరు తగిలి ఏనుగు మృతి చెందింది. మండలంలోని మొగిలివారిపల్లె కుంటబెల్ల అటవీ సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తగిలి ఏనుగు మృతి చెందింది.
- 2022లో గాండ్లపల్లె వద్ద ప్రమాదవశాత్తు ఓ ఏనుగు వ్యవసాయ బావిలో పడిపోయింది. రైతులు గుర్తించి అటవీశాఖ అధికారులకు తెలియజేయడంతో బావిలో పడిన ఏనుగును రక్షించి అడవిలోకి వదిలిపెట్టారు.
- మండలంలోని కొదలమడుగు వద్ద పొలంలో కరెంటు తీగలను తాకి ఏనుగు మృతి చెందింది.



మొగిలివారిపల్లెలో కరెంటు తీగలు తాకి చనిపోయిన ఏనుగు(ఫైల్)

కళోత్సవాలకు పుత్తూరు, కార్వేటినగరం విద్యార్థులు



రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులతో డైట్ అధ్యాపకులు

కార్వేటినగరం: జిల్లా విద్యాశిక్షణసంస్థ(డైట్)లో గురువారం నిర్వహించిన జిల్లా కళోత్సవ పోటీల్లో కార్వేటినగరం, పుత్తూరు విద్యార్థులు సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని డైట్ అధ్యాపకులు దేవప్రసాద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ డైట్ కళాశాలో 4, 5వ తేదీల్లో రెండు రోజుల పాటు ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి వచ్చిన 9 నుంచి 12వ తరగతి వరకు విద్య నభ్యసించే ప్రభుత్వ, రాష్ట్రస్థాయి కళాఉత్సవ ఎంపిక పోటీలు నిర్వహించారన్నారు.

విజేతలు వివరాలు

ఓకల్ మ్యూజిక్ గ్రూపు విభాగంలో పుత్తూరు బాలికల హైస్కూలుకు చెందిన వి.తన్మయ మొదటి స్థానం, కార్వేటినగరం బాలికల ప్లస్ ఉన్నత పాఠశాలకు చెందిన గాయత్రి ద్వితీయ స్థానం, అదే పాఠశాలకు చెందిన పూజిత తృతీయ స్థానం దక్కించుకున్నారు. అలాగే ఇన్స్ట్రుమెంట్ మ్యూజిక్ పోటీల్లో పుత్తూరు బాలికల హైస్కూలుకు చెందిన మౌనిక, డ్యాన్స్ గ్రూపు విభాగం పోటీలో పుత్తూరు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన శరణ్య మొదటి, మహేశ్వరీ ద్వితీయస్థానం దక్కించుకున్నారు. అలాగే థియేటర్ గ్రూపు విభాగంలో భార్గవి మొదటి బహుమతి పొందింది. విజ్యువల్ ఆర్ట్స్ పోటీలో పుత్తూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని యోగిత కైవసం చేసుకుంది. ట్రెడిషినల్ ఆర్ట్స్ గ్రూపు విభాగం పోటీల్లో పచ్చికాపల్లం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విజేతలుగా నిలిచింది. విజేతలకు జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు నిర్మలాదేవి, అనిత, బోధనేతర సిబ్బంది కృపావతి, పురుషోత్తం పాల్గొన్నారు.

విద్యా విధానాలపై పునఃసమీక్షించాలి

- రాయచోటి ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలి
- డీఈఓ కార్యాలయం ఎదుట కొవ్వొత్తులతో ఫ్యాప్టో నేతల నిరసన



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న సంఘ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్: విద్యా విధానాలపై రాష్ట్ర ప్రభుత్వం పునఃసమీక్షించాలని ఫ్యాప్టో సంఘ నాయకులు గంటామోహన్ డిమాండ్ చేశారు. అన్నమయ్య జిల్లా రా యచోటిలో విద్యార్థుల దాడిలో మృతి చెందిన టీచర్ ఇజాజ్ అహమ్మద్ ఘటనకు నిరసనగా గురువారం డీఈఓ కార్యాలయం ఎదుట ఫ్యాప్టో సంఘ నేత లు కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ వెర్రి తలలు వేస్తున్న యువతను సన్మార్గంలో పెట్టాలంటే, నేటి యాంత్రిక విద్యా విధానాలను పునఃసమీక్షించాలన్నారు. చదివినా చదవకపోయినా పాస్ అయ్యేలా అమలవుతున్న నాన్ డిటెన్షన్ విధానంలోని మంచి చెడులను లోతుగా పరిశీలించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. విద్యార్థులను క్రమశిక్షణలో పెట్టాల్సిన టీచర్లకు గాడి తప్పిన విద్యార్థిని దండించాలంటే భయపడే వాతావరణం నెలకొందన్నారు. డీఈఓ వరలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఫ్యాప్టో నేతలు చంగల్‌రాయమందడి, మదన్ మోహన్ రెడ్డి, మునీర్ అహ్మద్, ముక్తార్ అహ్మద్, చంద్రన్, మధుబాబు పాల్గొన్నారు.



పుష్ప-2 బెనిఫిట్‌షో రప్ప..రప్పలాడించింది. తగ్గేదేలే అంటూ అభిమానులను ఉర్రూతలూగించింది. థియేటర్ల వద్ద అభిమానుల కోలాహలం కనిపించింది. డప్పు వాయిద్యాలతో పుష్ప-2 జాతరను తలపించింది. స్క్రీన్‌పై బొమ్మ పడే సరికి థియేటర్లలో చిత్తూరు యాస కేక పుట్టించింది. పాన్ ఇండియా రేంజ్‌లో తిరుపతి గంగమ్మ జాతరను చూపించడం కేరింతలు కొట్టించింది. మొత్తం మీద కనీవిని ఎరుగని రీతిలో పుష్ప-2కు అభిమాన కెరటం పోటెత్తింది.

పుష్ప జాతర!

- చిత్తూరు, తిరుపతి జిల్లాలో పుష్ప-2 హౌస్‌ఫుల్
- రప్ప..రప్ప లాడించిన బెనిఫిట్ షో
- థియేటర్ల వద్ద అభిమానుల సందడి
- పాన్ ఇండియా రేంజ్‌కు తిరుపతి గంగ జాతర
- చిత్తూరు యాసే సినిమాకు హైలెట్

కాణిపాకం: చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో బుధవారం రాత్రి పుష్ప-2 చిత్రం విడుదలైంది. భారీ అంచనాలతో తెరకెక్కిన ఈ చిత్రం అభిమానులు, ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించింది. పోస్టర్లు, ట్రైలర్లు ఆకట్టుకుంటూ వచ్చాయి. దీంతో పుష్ప-2 భారీగా జనాదరణను కూడగట్టుకుంది. రెండు జిల్లాల పరిధిలో మొత్తం 135పైగా థియేటర్లు ఉండగా ఇందులో 115 థియేటర్లలోనూ పుష్ప-2 రిలీజ్ చేశారు. బెనిఫిట్‌షోలకు ప్రేక్షకులు క్యూ కట్టారు. రాత్రి 7 గంటల నుంచి ఆయా థియేటర్ల వద్ద అభిమానులు సందడి చేశారు. డప్పు దరువుతో చిందులేశారు. అల్లు అర్జున్ భారీ కటౌట్‌లు, పోస్టర్లకు పాలాభిషేకం చేశారు. చేతిలో కర్పూరం అంటించి దిష్టి తీశారు. సినిమా బంపర్ హిట్ కొట్టాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొందరు పుష్ప జాతర గెటప్ వేసుకుని థియేటర్ల వద్ద సందడి చేశారు. ఇక రాత్రి 9 గంటలకు కొన్ని చోట్ల బెనిఫిట్ షోలు నిర్వహించారు. మరికొన్ని చోట్ల 9.30, 9.45 గంటలకు బెనిఫిట్ షో వేశారు. కొన్ని చోట్ల గేట్లపైకి దూసుకెళ్లారు. పుష్ప-2 నినాదాలతో హోరెత్తించారు.

యాంటీ ఫ్యాన్స్

పుష్ప-2 రిలీజ్ కాకముందు నుంచే యాంటీ ఫ్యాన్స్ రెచ్చిపోయారు. సినిమాపై ట్రోల్స్ చేస్తూ వచ్చారు. రిలీజ్ అయిన తర్వాత కూడా వాళ్ల ట్రోల్స్‌కు అంతు లేకుండా పోతోంది. సోషల్ మీడియాను వేదికగా చేసుకుని ట్రోల్స్ చేస్తున్నారు. వారికి అల్లుఅర్జున్ అభిమానులు, పుష్ప-2 ప్రేక్షకులు ఘాటుగా సమాధానమిస్తున్నారు.

తిరుపతి గంగమ్మ జాతర సీనే హైలెట్

చిత్తూరు జిల్లా అంటేనే గంగమ్మ జాతరకు ప్రత్యేకం. అలాంటి జాతరకు ఈ పుష్ప-2లో ప్రాధాన్యత ఇచ్చారు. ప్రధానంగా తిరుపతి గంగమ్మను పాన్ ఇండియా రేంజ్‌లో తీసుకెళ్లారు. మాతంగి వేషధారణలో అల్లుఅర్జున్ ఫైట్, పాట సీన్‌లలో 10 నుంచి 15 నిమిషాల వ్యవధి పాటు కనిపిస్తాడు. మళ్లీ క్లైమాక్స్‌లో అమ్మవారి వేషధారణ అబ్బురపరిచింది. చిత్తూరు జిల్లా అంటే చాలా మంది ఎర్రచందనం మాత్రమే స్పెషల్ అనుకుంటారు. అయితే పుష్ప-1, పుష్ప-2లో చిత్తూరు యాస, గంగమ్మ జాతరకు ప్రాధాన్యమిచ్చారు.

యాస ఉంటాది..సామీ

సినిమా హైలెట్‌లో చిత్తూరు యాస ఒకటి. 'నా నోటితో చెప్పలేనుగానీ మీరే వెళ్లి చూడండి' అన్నట్టుగానే ఉంది. చిత్తూరు యాసను అచ్చుగుద్దినట్లు దింపేశారు. నటీనటులందరూ యాసలో ఇరగదీశారు. ఇక భాకరపేట, వరదయ్యపాళెం, మంగళం, తడ చెక్‌పోస్టులు, నగరి, చిత్తూరు జిల్లా ప్రస్తావనతో చిత్తూరోళ్లలో ఉత్సాహాన్ని రేకెత్తించింది.

బుకింగ్‌లు.. హౌస్‌ఫుల్

కొత్త సినిమా వస్తే పట్టణ ప్రాంతాల్లో తొలి రోజు రెండు, మూడు థియేటర్లల్లో మాత్రమే ఆడేది. సినిమాకు హిట్ టాక్ వస్తే మరో రెండు రోజుల పాటు కొనసాగుతుంటాయి. అయితే ఎన్ని థియేటర్లు ఉంటే అన్ని థియేర్లలోనూ సినిమాలు వేయడం పుష్ప-2 ఒక్కటేనని థియేటర్ నిర్వాహకులు చెబుతున్నారు. ఇక సినిమా రిలీజ్ డేట్ ప్రకటించడంతో కొన్ని రోజులకు ముందు నుంచే టిక్కెట్ల బుకింగ్ ప్రారంభయ్యాయి. బెనిఫిట్ షోకూ గంటల వ్యవధిలోనే టిక్కెట్లన్నీ అమ్ముడుబోయాయి. గురువారం కూడా అన్ని థియేటర్లు, అన్ని షోలు హౌస్‌ఫుల్ అయ్యాయి. ఈ బెనిఫిట్ షోలకు అభిమానులు మాత్రమే కాదు వివిధ శాఖల అధికారులు క్యూకట్టారు. యువతులు సైతం ముందు వరుసలో నిలిచారు. బెనిఫిట్ షోలో దెబ్బలు పడుతాయ్ రో..అనే పాటకు డ్యాన్స్‌లు, రీల్స్ చేస్తూ ఉత్సాహంతో కనిపించారు. కాగా శని, ఆదివారాలకు అప్పుడే టిక్కెట్లు బుక్కయ్యినట్లు తెలిసింది.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఈ నెల 6వ తేదీ నుంచి జనవరి 8వ తేదీ వరకు నిర్వహించే రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ కోరారు. గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా నిర్దేశించిన షెడ్యూల్ మేరకు 33 రోజుల పాటు రెవెన్యూ సదస్సుల నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, వీఆర్వో, విలేజ్ సర్వేయర్లు రోజుకు ఒక గ్రామం లో గ్రామ సభలు నిర్వహిస్తారని చెప్పారు. ప్రజలు దారి సమస్యలు, భూ సమస్యలు, రీ సర్వే సమస్యలు, జాయింట్ అకౌంటు సమస్యలు, డీకేటీ, ఎస్‌హెచ్ సమస్యలకు సంబంధించి వినతులు అందజేయవచ్చన్నారు.

రేపు మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్

జిల్లాలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఈ నెల 7 వ తేదీన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాల పెంపునకు తల్లిదండ్రుల భాగస్వామ్యం ఎంతగానో తోడ్పడుతుందన్నారు. డీఆర్‌వో మోహన్‌కుమార్, డీఈఓ వరలక్ష్మి, సమగ్రశిక్ష ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణా రెడ్డి. సెక్టోరల్ అధికారులు జయప్రకాష్, ఉదయలక్ష్మి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు
– యువకుడి మృతి


మృతుడు చరణ్ (ఫైల్)

బైరెడ్డిపల్లె: పలమనేరు–కుప్పం జాతీయ రహదారిలోని కమ్మనపల్లె గురుకుల పాఠశాల వద్ద గురువారం మధ్యాహ్నం ఓ ద్విచక్రవాహనాన్ని కారు ఢీ కొన్న సంఘటనలో యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ పరుశురాముడు కథనం మేరకు.. కమ్మనపల్లె పంచాయతీ ఎర్రకదిరేపల్లె దళితవాడకు చెందిన నారాయణప్ప కుమారుడు చరణ్ (27) పలమనేరు నుంచి ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి బయలుదేరాడు. తవణంపల్లె మండలం వెంగంపల్లెకు చెందిన గిరిధర్ ఏడుగురు స్నేహితులతో కలిసి ఇన్నోవా కారులో శబరిమలై వెళుతూ కమ్మనపల్లె గురుకుల పాఠశాల వద్ద అతి వేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీ కొంది. దీంతో చరణ్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 కు సమాచారం అందించి పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య వెన్నెల ఉంది. మృతుడి తండ్రి నారాయణప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

మూర్ఛవచ్చి..
రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పుంగనూరు: మూర్ఛరావడంతో బైకు అదుపు తప్పి కిందపడిన వ్యక్తికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. కర్ణాటకలోని మాచినాయునిపల్లెకు చెందిన రైతు సుబ్రమణ్యం గురువారం సొంత పని నిమిత్తం ద్విచక్రవాహనంపై పుంగనూరుకు బయలుదేరారు. మార్గ మధ్యంలోని పుంగమ్మ చెరువు వద్దకు రాగానే అతడికి మూర్ఛరావడంతో ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. ఈ ఘటనలో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి బాధితుడిని 108లో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మదనపల్లె ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో నైట్‌వాచ్‌మెన్ దుర్మరణం


మృతిచెందిన చంద్రప్ప(ఫైల్)

పలమనేరు/గంగవరం: పట్టణ సమీపంలోని క్యాటిల్ ఫామ్ బ్రిడ్జి వద్ద గురువారం పొద్దున జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడి పశుపరిశోధన కేంద్రంలో నైట్‌వాచ్‌మెన్‌గా పనిచేసే రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన చంద్రప్ప(58) మృతి చెందాడు. బుధవారం రాత్రి విధులకు వెళ్లి గురువారం పొద్దున తన మోటార్‌సైకిల్‌పై ఇంటికెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా చిత్తూరువైపు వెళుతున్న ఓ కారు ఇతని బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

తేరు.. భక్తజన హోరు



తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజైన గురువారం ఉదయం అమ్మవారికి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రథంపై ముత్యపు కవచాలంకరణలో శ్రీపద్మావతి అమ్మవారు కొలువుదీరి తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తుల కోలాటాలు, భజన బృందాలు, గోవిందనామ స్మరణ నడుమ అమ్మవారి రథోత్సవాన్ని ప్రారంభించారు. అమ్మవారి రథాన్ని లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. మధ్యాహ్నం 12 గంటలకు రథ మండపంలో అమ్మవారికి వేడుకగా స్నపన తిరుమంజనం, సాయంత్రం ఆస్థానమండపంలో ఊంజల్‌సేవ నిర్వహించారు. రాత్రి అశ్వ వాహనంపై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. తిరుమల పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి, టీటీడీ ఈఓ శ్యామలరావు, జేఈఓ వీరబ్రహ్మం, సీఈ సత్యనారాయణ, డెప్యూటీ ఈఓ గోవిందరాజన్, ఆలయ అర్చకులు బాబుస్వామి పాల్గొన్నారు. – చంద్రగిరి

అక్రమ మద్యం కేసులో ముగ్గురి అరెస్టు


మద్యం వ్యాపారుల అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

పుంగనూరు: కర్ణాటక నుంచి మద్యం అక్రమంగా తరలించి, విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసి, వారి వద్ద ఉన్న మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోలీసులకు అందిన సమాచారంతో చౌడేపల్లె మండలం తిరుమణపల్లిలో తనిఖీ చేయగా గ్రామానికి చెందిన ఈశ్వరయ్య వద్ద 11 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే అదే మండలం పాపిశెట్టిపల్లె బస్టాప్ వద్ద నరసింహరాజు అక్రమంగా నిల్వ ఉంచిన కర్ణాటక మద్యం 32 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే లద్దిగం గ్రామానికి చెందిన జైనాబి వద్ద కర్ణాటక మద్యం 25 ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, ముగ్గురిపై కేసు నమోదు చేసి, అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. పుంగనూరు మండలం పెద్దతాండా వద్ద సారా బట్టీలను ధ్వంసం చేశామని పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ పోలీసులు సుబ్రమణ్యంగౌడ్, నాగరాజు, ఢిల్లీ, సురేంద్రబాబు , నరేంద్రరెడ్డి , కిషోర్‌కుమార్, సూరిబాబు, ఉమామహేష్ తదితరులు పాల్గొన్నారు.

టెంపోను ఢీకొన్న ఐషర్


బోల్తా పడిన టెంపో

గంగవరం: తిరుపతి నుంచి బెంగళూరుకు వెళుతున్న మినీ టెంపోని ఐషర్ వాహనం వెనుక నుంచి ఢీకొన్న ప్రమాదంలో టెంపో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటన మండలంలోని గంగవరం బైపాస్ వైఎస్సార్ జంక్షన్ వద్ద గురువారం వేకువజామున జరిగింది. సీఐ ప్రసాద్ కథనం మేరకు.. బెంగళూరు కేఆర్ పురానికి చెందిన దాదాపు 15 మంది గత బుధవారం ట్రావెల్ టెంపోలో తిరుచానూరు పద్మావతీ అమ్మవారి బ్రహ్మోత్సవాలకు బయలుదేరి వెళ్లారు. అక్కడ నుంచి బెంగళూరుకు తిరిగి వెళుతుండగా గంగవరం బైపాస్‌లోని వైఎస్సార్ జంక్షన్‌లో టెంపోట్రావెలర్‌ను నుంచి ఐషర్ వాహనం ఢీకొన్న ఘటనలో టెంపో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో టెంపోలో ప్రయాణిస్తున్న వారందరికీ స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


ఆత్మయ్య(ఫైల్)

ఐరాల: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం మండలంలోని అక్కంచెరువు వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని తెల్లగుండ్లపల్లె ఎస్సీ కాలనీకి చెందిన వెంకటస్వామి కుమారుడు ఆత్మయ్య(43), సురేష్ ఇద్దరు ద్విచక్రవాహనంలో సొంత పనుల నిమిత్తం పాకాలకు వెళ్లారు. పనులు ముగించుకుని తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. ఈ క్రమంలో చిత్తూరు, పీలేరు జాతీయ రహదారి అక్కంచెరువు వద్ద ద్విచక్రవాహనంలో వెళుతున్న ఇద్దరిని గుర్తుతెలియని లారీ బైక్ వెనుక ఢీకొంది. దీంతో ఆత్మయ్య రోడ్డుపై పడడంతో లారీ చక్రాలు తల ఎక్కడంపై వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సురేష్ రోడ్డుపై పడడంతో గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోటారు సైకిళ్ల చోరీ కేసులో వ్యక్తి అరెస్టు


నిందితుడి అరెస్టు చూపుతున్న సీఐ శ్రీనివాసులు

బంగారుపాళెం: మోటారు సైకిళ్ల చోరీ కేసులో గురువారం సాయంత్రం ఓ వ్యక్తిని అరెస్టు చేసి, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. సీఐ కథనం మేరకు.. తగ్గువారిపల్లె ఇందిరమ్మకాలనీ రాగిమానుపెంట రోడ్డు పక్కన నివాసముంటున్న నాగరాజన్ ఇంటి ముందు మోటారు సైకిల్ పార్కు చేసి ఉండగా వారం క్రితం గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారని ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసుకు సంబంధించి మొగిలి వెంకటగిరి గ్రామానికి చెందిన చిన్నరెడ్డెప్ప కుమారుడు రాజేష్(27)ను నలగాంపల్లె బ్రిడ్జి వద్ద అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి రూ 1.40 లక్షల విలువైన రెండు పల్సర్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఇతనిపై ఇది వరకే పలు చోరీ కేసులున్నట్లు సీఐ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత


సీజ్ చేసిన రేషన్ బియ్యం

శ్రీరంగరాజపురం: మండలంలోని సీకే పురం గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 600 కిలోల రేషన్ బియ్యాన్ని పోలీసులు సీజ్ చేశారు. ఎస్ఐ సుమన్ కథనం మేరకు.. ఎస్ఆర్ పురం గ్రామానికి చెందిన మురగన్ గత కొంత కాలంగా మండలంలోని పలువురి వద్ద రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు సేకరించి తమిళనాడులోని కోళ్ల పారాలకు తరలించి రూ. లక్షలు సొమ్ము చేసుకుంటున్నాడు. ఈక్రమంలోనే అక్రమంగా తమిళనాడుకు తరలించేందుకు సీకేపురం గ్రామంలోని ఓ ఇంట్లో బియ్యం నిల్వ చేసినట్లు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ చెప్పారు. దాడుల్లో అక్రమ రవాణా చేసేందుకు సిద్ధంగా నిల్వ ఉంచిన 600 కిలోల బియ్యాన్ని సీజ్ చేసినట్లు ఎస్ఐ చెప్పారు. కాగా మురుగన్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వెదురుకుప్పం ఎస్ఐపై హైకోర్టులో రిట్

తిరుపతి: వెదురుకుప్పం ఎస్ఐ వెంకటసుబ్బయ్య, కానిస్టేబుల్ గవాస్కర్‌పై హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలైంది. వెదురుకుప్పం మండలంలోని ఆళ్లమడుగు గ్రామానికి చెందిన నల్లపరెడ్డి పండురెడ్డి అతని కుమారులు మార్కొండారెడ్డి, ఢిల్లీరెడ్డిపై అన్యాయంగా దాడికి పాల్పడిన ఎస్ఐ, కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలంటూ హైకోర్టును ఆశ్రయించారు. బాధితుడి కథనం మేరకు.. ఆళ్లమడుగు గ్రామానికి చెందిన పండురెడ్డికి బాలకృష్ణారెడ్డికి కొంతకాలంగా చెక్‌బౌన్స్ విషయమై చిత్తూరు మెజిస్ట్రేట్ కోర్టులో కేసు నడుస్తోంది. అయితే బాలకృష్ణారెడ్డి పలసార్లు పండురెడ్డిపై భౌతికదాడులకు ప్రయత్నిస్తుండడంతో గత నెల తమ కుటుంబానికి రక్షణ కల్పించాలని వెదురుకుప్పం పోలీసులను ఆశ్రయించారు. అయితే రక్షణ కల్పించాల్సిన ఎస్ఐ వెంకటసుబ్బయ్య, కానిస్టేబుల్ గవాస్కర్ తమకు రక్షణ కల్పించక పోగా తనతో పాటు ఇద్దరు కుమారులపై దాడి చేశారని పిటిషన్‌లో పేర్కొన్నారు. కాగా తమపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ రిట్ దాఖలు చేసినట్లు బాధితుడు తెలిపారు.

అంబేడ్కర్ ఫొటోకు అవమానం


చెత్తదిబ్బల్లో పడేసిన అంబేడ్కర్ ఫొటో

పుంగనూరు: మండలంలోని నల్లూరుపల్లిలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు కోసం కేటాయించిన స్థలంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ ఫొటోను కొందరు చెత్తదిబ్బల్లో పడేసిన సంఘటన గురువారం వెలుగు చూసింది. నల్లూరుపల్లిలో ఎస్సీ కాలనీలోని సర్వే నంబర్ 11/2లో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు కోసం స్థలాన్ని కేటాయించారు. ఇలా ఉండగా ఆ స్థలాన్ని శుభ్రం చేసి గ్రామస్తుల సహకారంతో అంబేడ్కర్ ఫొటోను ఏర్పాటు చేసి, విగ్రహ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఇలా ఉండగా అదే గ్రామానికి చెందిన శ్రీరాములు, వెంకట్రమణ, లక్ష్మీదేవి తదితరులు బుధవారం రాత్రి అంబేడ్కర్ ఫొటోను తీసి చెత్తదిబ్బల్లో పడేశారని రాష్ట్ర దళిత సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.శంకరప్ప పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై చర్యలు తీసుకోవాలంటూ జిల్లా కలెక్టర్‌కు, ఎస్పీకి కూడా ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఇంటిపై గజరాజు దాడి
ధాన్యం ఆరగించిన ఏనుగు


ఏనుగు ధ్వంసం చేసిన ఇంటి కిటికీ.. గజరాజు తినగ మిగిలిన ధాన్యం

పలమనేరు: ఓ ఏనుగు పొలం వద్ద ఉన్న రైతు ఇంటిపై దాడి చేసి, ఇంట్లో నిల్వ ఉంచిన ధాన్యాన్ని ఆరగించిన సంఘటన బుధవారం రాత్రి పలమనేరు మండలంలోని బండమీద ఇండ్లు గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బండమీద ఇండ్లు గ్రామానికి చెందిన విజయన్ అనే రైతు పొలం వద్ద ఇల్లు కట్టుకుని అక్కడే సేద్యం చేసేవాడు. ఇటీవల వరి కోత కోసి, ధాన్యాన్ని ఆ ఇంట్లో పోసి గ్రామానికి వెళ్లాడు. బుధవారం రాత్రి కౌండిన్య అడవిలో నుంచి వచ్చిన ఓ ఏనుగు ధాన్యం వాసన పసిగట్టి, ఆ ఇంటి కిటికీలను తొలగించి, ధాన్యాన్ని ఆరగించి వెళ్లింది. గురువారం పొద్దున ఈ విషయం గమనించిన రైతు స్థానిక అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. జరిగిన నష్టంపై అటవీశాఖ సిబ్బంది పరిశీలించి అంచనాలను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు సెక్షన్ ఆఫీసర్ సుకుమార్ తెలిపారు.

9 మంది ఎంపీహెచ్ఏలు తొలగింపు

చిత్తూరు రూరల్(కాణిపాకం): ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న ఎంపీహెచ్ఏ–మేల్(మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్) 9 మందిని ఉద్యోగం నుంచి తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వారిని రిలీవ్ చేశారు. కాగా వీరు పదో తరగతి విద్యార్హతతో 1999–2000లో శిక్షణ పూర్తి చేసి ఉద్యోగంలో చేరారు. పదో తరగతి విద్యార్హతతో వీరు ఉద్యోగంలో చేరారని వీరిని ఉద్యోగం నుంచి తొలగించినట్లు ఎంపీహెచ్ఏలు పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రామకుప్పంలో నెట్ సెంటర్లు సీజ్


నెట్ సెంటర్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న రెవెన్యూ, పోలీసు అధికారులు

రామకుప్పం: మండలంలో నెట్ సెంటర్ల నిర్వాహకులు నకిలీ జనన ధ్రువీకరణ పత్రాలను తయారు చేసి ఇష్టారాజ్యంగా ప్రజలకు అందిస్తున్నారని రెవెన్యూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందింది. నకిలీ పత్రాల భాగోతంపై కొందరు స్థానికులు కుప్పం ఆర్డీఓ శ్రీనివాసరాజుకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో గురువారం ఆర్డీఓ రామకుప్పం తహసీల్దార్ బాబు, కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్, రాళ్లబూదుగూరు ఎస్ఐ నరేష్, ఎంపీడీఓ లక్ష్మీకాంత్‌తో కలసి నెట్ సెంటర్లపై ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం రోడ్డులో నెట్ సెంటర్ నిర్వాహకుడు నవీన్, వీర్నమల గ్రామంలో బాలాజీ నెట్ సెంటర్ నిర్వహిస్తూ నకిలీ జనన ధ్రువపత్రాలను తయారు చేసి ప్రజలకు అందించినట్టు అధికారుల తనిఖీల్లో గుర్తించారు. నకిలీ పత్రాల భాగోతంపై నెట్ సెంటర్‌లో ప్రాథమికంగా ఆధారాలు లభించినట్లు తహసీల్దార్ బాబు తెలిపారు. నకిలీ పత్రాలను సృష్టించి అక్రమంగా ప్రజలకు పంచిపెట్టిన వారిపై శాఖాపరమైన విచారణ అనంతరం నెట్ సెంటర్ల నిర్వాహకులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. తనిఖీల్లో భాగంగా రెండు నెట్ సెంటర్లను సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు.

మండీ వ్యాపారుల వివాదం.. రైతులకు శాపం


వి.కోటలోని మార్కెట్

వి.కోట/పలమనేరు: పలమనేరు వ్యవసాయశాఖ మార్కెట్ పరిధిలోని వి.కోట ఉపమార్కెట్‌లో మండీవ్యాపారుల మధ్య నెలకొన్న వ్యవహారం రైతులకు శాపంలా మారింది. అక్కడి మార్కెట్‌లో పెద్ద వ్యాపారులెవరో, చిన్నవ్యాపారులెవరో వారి ఆధిపత్యాలకు రైతులు బలికావడం విడ్డూరంగా మారింది. ఇప్పటికే అక్కడున్న మండీ వ్యాపారులు సంఘంగా ఉంటున్నారు. ఇందులో కొంతమంది తాము కూడా సంఘంలో చేరాలని ఇటీవల ప్రయత్నాలు చేసినట్టు సమాచారం. దీనిపై వారి మధ్య ఎలాంటి విభేదాలు తలెత్తాయో తెలియని పరిస్థితి. ఇది ఇలాఉండగా కొందరు తమకు అన్యాయం జరిగిందంటూ సామాజిక మాధ్యమాల్లోకి ఎక్కారు. ఈ విషయం జిల్లా వ్యాప్తంగా జోరుగా వైరల్ అయ్యింది. వి.కోట మార్కెట్‌లో అన్యాయం, అక్రమాలు సాగుతున్నాయన్నది దాని సారాంశం. దీనిపై స్పందించి జిల్లా కలెక్టర్ వెంటనే విచారణ చేపట్టాలని మార్కెటింగ్ ఏడీ పరమేశ్వరన్‌ను ఆదేశించారు. దీంతో ఆయన గురువారం అక్కడి వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. కేవలం ఇద్దరు కొత్త మండీ వ్యాపారులను సంఘంలో చేర్చుకోనందున ఈ వ్యవహారాన్ని లేవదీసినట్టు విచారణలో తెలుసుకున్నారు. ఇకపై రైతులకు ఇబ్బంది కలిగేలా ఎవరూ ప్రయత్నించినా చర్యలు తప్పవని గట్టిగా హెచ్చరించారు. మార్కెటింగ్ నిబంధలను పాటించని మండీ వ్యాపారుల లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. దీంతో అక్కడి సమస్య పరిష్కారమైంది.

ప్రజావేదికను అడ్డుకున్న టీడీపీ నాయకులు


అధికారులతో వాదనకు దిగిన టీడీపీ నాయకులు

శాంతిపురం: ఉపాధిహామీ పనుల సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు అడ్డుకున్నారు. దీంతో ప్రజావేదిక కార్యక్రమం వాయిదా పడింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో శాంతిపురం మండలంలో జరిగిన రూ 8.76 కోట్ల పనులను గత నెల 22 నుంచి తనిఖీ బృందం పరిశీలించింది. కూలీలు, లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి వివరాలను నమోదు చేసుకుని అన్ని పంచాయతీల్లో గ్రామ సభలను పూర్తి చేశారు. అయితే గత ప్రభుత్వ హయాంలో జరిగిన పనులపై తాము కోరిన విధంగా తనిఖీ బృందం నివేదికలను సిద్ధం చేయకపోవడంపై అధికార పార్టీ నాయకులు అసంతృప్తితో ఉన్నారు. దీంతో సామాజిక తనిఖీ సక్రమంగా జరగలేదంటూ గురువారం జరగాల్సిన ప్రజావేదికను అడ్డుకున్నారు. సభకు కూలీలు తక్కువగా వచ్చారని, గ్రామాల్లో చాటింపు వేయలేదని, తమకు కూడా సమాచారం ఇవ్వలేదని వివాదానికి దిగారు. అధికారులు ఎంతగా నచ్చజెప్పే ప్రయత్నం చేసినా ఉపయోగం లేకపోయింది. మధ్యాహ్నం ఒంటి గంట వరకూ కూడా సభ ప్రారంభం కావడంతో అంతంత మాత్రంగా కూలీలు కూడా వెళ్లిపోయారు. ఎట్టకేలకు పీడీ రవికుమార్, జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ శివయ్య ప్రజావేదికను వాయిదా వేస్తున్నట్టు ప్రకటించి, వెనుదిరిగారు.

ఏనుగుల కట్టడికి లేజర్ త్రిబుల్ టెక్నిక్
విద్యార్థిని వినూత్న ఆలోచన


ఏనుగుల కట్టడి ప్రాజెక్టును ఎమ్మెల్యేకు వివరిస్తున్న విద్యార్థిని రజని

పలమనేరు: ఏనుగుల కట్టడికి ఓ విద్యార్థిని వినూత్న ఆలోచన చేసింది. అదే లేజర్ ట్రిపుల్ టెక్నిక్. వివరాల్లోకి వెళితే.. పలమనేరు మున్సిపాలిటీ పరిధిలోని గొబ్బిళ్లకోటూరుకు చెందిన నాగరాజు కుమార్తె రజని వేము ఇంజినీరింగ్ కళాశాలలో ట్రిపుల్‌ఈ చదువుతోంది. గత కొన్నేళ్లుగా గ్రామంలోని రైతుల పంటలను ఏనుగులు ధ్వంసం చేసి, నష్టం చేస్తుండడంతో ఈ సమస్యకు సొంతంగా పరిష్కారం కనుగొనాలని భావించింది. దీంతో ఓ వినూత్న టెక్నిక్‌ను రూపొందించి, దాన్ని అటవీ శాఖ ద్వారా ప్రభుత్వం ఆచరణకు సాధ్యమైతే చేపట్టాలని భావించింది. దీంతో గురువారం స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని కలిసి ఇందుకు సంబంధించిన ప్రాజెక్టును ఆయనకు వివరించింది. ముఖ్యంగా ఏనుగులు, తేనెటీగలు, అగ్గి, పులులు, సింహాల గర్జనలకు భయపడుతాయని తెలిపింది. దీంతో త్రీడీ బొమ్మల ప్రదర్శనతో ఏనుగులు చూసి భయపడేట్టు చేయాలని తెలిపింది. ఇందుకు రైతుల పొలాల వద్ద కెమెరా, సెన్సార్లు, ఓ స్మార్ట్ ఫోన్ ఉండాలని, దీంతోపాటు సౌండ్‌బాక్సులు తదితరాల అవసరం ఉంటుందని పేర్కొన్నారు. దీనిపై అటవీ శాఖ అధికారులు అధ్యయనం చేసి అమలు చేసే అవకాశం ఉంటే చేపట్టాలని తెలిపారు. ఆ విద్యార్థినిని స్థానిక ఎమ్మెల్యే అభినందించి దీనిపై అటవీ శాఖ ఉన్నతాధికారులతో చర్చించనున్నట్టు తెలిపారు. కురబసంఘం నేతలు సుబ్రమణ్యం గౌడు, ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్ర నాయుడు పాల్గొన్నారు.